నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం ఆగస్టు 05, 2024 www.navatelangana.com

నేటి ప్రజావాణి రద్దు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నేడు (5వ తేదీ) రద్దు చేసినట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివాంర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం ప్రారంభం అవుతున్న దృష్ట్యా అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సి ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ నెల 12 నుండి ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

7వ తేదీ నుంచి పంటలకు ఎస్సారెస్పీ నీటి విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీటి అవసరాల కోసం బుధవారం నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాసరావు గుప్త ఆదివారం తెలిపారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో , ఎగువ ప్రాంతాల లో మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టు లోకి క్రమంగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో నీటి సామర్థ్యం పెరుగుతున్నట్టు తెలిపారు.



వరద నీటి చేరికతో నిండుకుండలా ఎస్సారెస్పీ

వివరాలు మెయిన్‌లో..

మున్సిపాలిటీలో ఇష్టారాజ్యం

- బాన్సువాడలో అభివృద్ధి మరచి.. స్వయం సేవలో
- సమయపాలన మరచిన ఉద్యోగులు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

బాన్సువాడ మున్సిపాలిటీలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు, సమయపాలన పాటించడం లేదని బాన్సువాడ పట్టణ ప్రజలు, సీఐటీయూ నేతలు ఆరోపిస్తున్నారు. అధికారులు, సిబ్బంది అవినీతికి పరాకాష్టకు చేరిందని, విధులకు చుట్టపు చూపుగా వస్తూ వెళుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో కొందరు రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన ఉద్యోగులు కౌన్సిలర్‌లను, ఉన్నతాధికారులను మచ్చిగ చేసుకొని చుట్టపు చూపుగా ఆఫీస్‌కు వస్తూ తమ వ్యాపారంలో నిమగ్నం అవుతున్నట్టు ప్రధాన ఆరోపణ. ఉద్యోగి ప్రవేట్ వ్యాపారం చేసుకున్నా ఆఫీస్‌కు రాకపోయినా ప్రశ్నించే వారు కరువయ్యారు. మరో ఉద్యోగి తన జీతం సరిపోనట్లు టెండర్ కాంట్రాక్టర్ల వద్ద నుంచి, ఇతర అభివృద్ధి పనుల కాంట్రాక్టర్ నుంచి మామూళ్లకు సిద్ధపడ్డట్లు తెలిసింది. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు అవినీతిలో మునిగిపోయారని, ఇష్టారీతి గా వ్యవహరిస్తున్నారన్నారని ఆరోపణ ఉంది. కొందరు కౌన్సిలర్లు అధికారుల పై ఒత్తిడి చేస్తూ కాళీ గా ఉన్న ఎలక్ట్రిసిటీ, ఇతర బిల్లులు తీసుకొచ్చి బిల్లులు చెయ్యాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. కౌన్సిలర్లు, మున్సిపాలిటీ అధికారులు సిబ్బంది మున్సిపల్ అభివృద్ధిని మరచి పోయారని ఆరోపణ.

ప్రభుత్వ జీతం ..స్వయం సేవలో

ప్రభుత్వ జీతం తీసుకుంటూనే కాంట్రాక్టర్లకు సేవనందిస్తున్న కొందరు ఉండడం, మరికొందరు సొంత పనులకు పైరవిలకే పరిమితమయ్యారు. ఇలా ఎవరికి వారే సొంత పనులు చేసుకోవడంతో బాన్సువాడ మున్సిపాలిటీ అభివృద్ధి కాలేక పోతుంది. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక కృషితో గ్రామ పంచాయతీగా ఉన్న బాన్సువాడను మున్సిపాలిటీగా మార్చారు. అధికారులకు, పాలక వర్గంకు పాత కార్యాలయం సరిపోకపోవటంతో కోట్లాది రూపాయలతో నూతన భవనం నిర్మించారు. అన్ని సౌకర్యాలు కల్పించినా పలువురు అధికారులు, సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారు. నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీకి రావలసిన ఆదాయం రాకుండా పోతుంది.



బాన్సువాడలోని మున్సిపల్ కార్యాలయం

మున్సిపాలిటీ ఆదాయం 5 కోట్ల 44 లక్షల 38 వేలు రావలసి ఉండగా ఇందులో ఇంటి పన్ను 4 కోట్ల 34 లక్షలు రావాలి. ఇందులో 1 కోటి 22 లక్షలు వసూల్ అయింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ భవనాల నుంచి 1 కోటి 3 లక్షలు రావలసి ఉండగా కేవలం 22 వేలు మాత్రమే వసూల్ అయ్యాయి. కేంద్ర ప్రభుత్వ భవనాల 6 లక్షల 7 వేలు రావలసి ఉండగా ఒక్క రూపాయి వసూల్ కాలేదు. మొత్తం 5 కోట్ల 44 లక్షల 38 వేలు రావలసి ఉండగా కేవలం 1 కోటి 22 లక్షల 38 వేలు వసూల్ అయినట్లు సమాచారం. ఇంకా 4 కోట్ల 21 లక్షల రూపాయల బకాయిలు ఉన్నట్లు తెలిసింది.

విసిగిపోతున్న ప్రజలు

రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన కొందరు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కొందరు విధులకు హాజరుకాకుండా చుట్టపుచూపుగా వస్తున్నారన్నారని తెలిసింది. ఇందులో కొందరు నిజాయితీగా విధులు నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీ ఏర్పడిన ఈ ఆరేళ్లలో పైరవీకారులకే అధిక ప్రాధాన్యత లభిస్తుంది. ఇంటి నిర్మాణం, నీటి , పారిశుద్ధ్య సమస్యలు ఉన్న వాటిని లెక్కచేయకుండా డబ్బులు వచ్చే పనులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తుంది. టీఎస్ బి పాస్ అధికారులకు వరంగా మారిందని, కోర్టు పరిధిలో ఉన్న భూములకు, నాళా కన్వెన్షన్‌లేని భూములకు, ఎఫ్‌టీఎల్ వెంచర్లకు అనుమతులిచ్చారని, 10శాతం భూమిని సంరక్షించలేక పోయారని, వీరిపై ఇంకా ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి నెలలు గడిచినా ఆమోదం లభించడం లేదని, ప్రజా ఆరోగ్యశాఖ, ఇంజనీరింగ్ శాఖ, పై పలు ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీ ఉద్యోగుల, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చైర్మన్, కమిషనర్ దృష్టికి కొందరు తీసుకెళ్లినప్పటికీ మున్సిపాలిటీలో అలాంటి ఉద్యోగులు లేరు అంతా మంచివారనే సర్టిఫికెట్ ఇస్తున్నట్లు సమాచారం.



సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

బడ్జెట్.. పేదవాడికి చేరుతలే

- విద్యా, వైద్యం ఉచితంగా అందిస్తేనే ప్రజలకు లబ్ది
- ఎమ్మెల్యేలు సహనం కోల్పోతున్నారు
- అరవింద్.. పసుపు బోర్డు ఎక్కడ..?
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

'కేంద్రంలో మోడీ ప్రభుత్వం గాని, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం గానీ బడ్జెట్‌లో కేటాయింపులు చెప్తున్నారు కానీ అవి పేదవాడికి ఏ మాత్రం అందుతుందో లేదో అని చూడట్లేదు. ఈ రంగానికి ఇంత అంత అంటూ బడ్జెట్ పెడుతున్నారని కానీ ఆ బడ్జెట్ పేదలకు లబ్ది చేకూరడం లేదు. ప్రభుత్వాలు పేదవానికి నేరుగా లబ్దిచేకూరే పథకాలు ప్రవేశపెట్టాలి. నరేంద్రమోడీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు 30 లక్షల కోట్ల రూపాయలు బకాయిలు మాఫీ చేశారు. కానీ పేదలకు మాత్రం చెయ్యటానికి మనసు ఒప్పడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వైద్యం ఉచితంగా అందిస్తే చాలని అప్పుడే ప్రజలకు లబ్ధి చేకూరుతుందని' సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు, ఏఐటీయూసీ అభినందన సభ కార్యక్రమానికి విచ్చేసి ఆయన టీఎన్‌జీఓ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముందుగా పార్టీ నాయకులు సాంబశివరావుకు సన్మానం చేశారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.

వివరాలు మెయిన్‌లో..

నసురుల్లాబాద్ మండలంలో మరో రెండు గ్రామ పంచాయతీలు



సంగెం గ్రామ ముఖచిత్రం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలంలో కొత్తగా 2 గ్రామ పంచాయతీలు ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. నసురుల్లాబాద్ మండలంలో ఇప్పటికీ 17 గ్రామ పంచాయతీలు ఉండగా మరో రెండు గ్రామ పంచాయతీలు ఏర్పడంతో మండలంలో మొత్తం గ్రామపంచాయతీల సంఖ్య 19కి చేరింది.

లింగంపల్లి తండా గ్రామం నుంచి ఫకిరనాయక్ తండా, సంగెం గ్రామం నుంచి సంగెం (ఏ)గా కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడనున్నాయి. మూడంచెలు గల పంచాయితీరాజ్ వ్యవస్థలో స్థానిక స్వపరిపాలనా కోసం ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తుంది. కొత్తగా గ్రామ పంచాయతీలు కావాలని ఎన్నో ఏండ్లుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ఆయా గ్రామల ప్రజలు విన్నవించుకోవడంతో వెంటనే స్పందించిన పోచారం పూర్తి స్థాయిలో వివరణ ఇవ్వాలని, గ్రామపంచాయితీ తీర్మానం చేసి ఇవ్వాలని కోరారు. దీనితో పూర్తి స్థాయిలో సర్వే చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర, జిల్లా అధికారులకు నివేదిక పంపించడంతో కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్ల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసినట్లు పంచాయతీ రాజ్ అధికారులు చెబుతున్నారు.

మెడికల్ కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజమాబాద్ సిటీ

ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, జూనియర్ రెసిడెంట్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బివి నాగమోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 ప్రొఫెసర్, 9 అసోసియేట్ ప్రొఫెసర్, 14 అసిస్టెంట్ ప్రొఫెసర్, 10 సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, 18 జూనియర్ రెసిడెంట్ పోస్టులు ఖాళీ ఉన్నాయని అందులో అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పథాలజీ, ఇఎన్టి, ఆప్తమాలజీ, గైనకాలజీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని, ఫిజియాలజీ, ఫార్మకాలజి, పథాలజీ, కమ్యూనిటీ మెడిసిన్-2, జనరల్ మెడిసిన్-2, సైకియాట్రి, అనస్థీషియా అసోసియేట్ ప్రొఫెసర్‌లు ఖాళీ ఉన్నాయని, అనాటమీ, ఫిజియాలజీ-2, బయో కెమిస్ట్రీ-2, ఫార్మకాలజీ, ఫరేన్సిక్ మెడిసిన్, గైనకాలజీ-3, కార్డియాలజీ, సిటీ సర్జరీ, ఎమర్జెన్సీ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఖాళీ ఉన్నాయని, బయో కెమిస్ట్రీ, పథాలజీ-2 ట్యూటర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని వివరించారు. ఈనెల 6 నుండి 12 వరకు ఉదయం 10:30 నుండి సాయంత్రం 4 వరకు మెడికల్ కళాశాలలో దరఖాస్తులు స్వీకరించబడునని, అదేవిధంగా ఈనెల 13 న ఉదయం 11 గంటల నుంచి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ కు వర్జిన్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. ఈనెల 14న ఇంటర్వ్యూలు ఉదయం 11 గంటల నుండి నిర్వహించడం జరుగుతుందని, అంతేకాకుండా మిగతా సమాచారం కోసం వెబ్సైట్ www.gmcnzb.org సందర్శించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలే ప్రభుత్వాలను కదిలిస్తాయి

- సీపీఐ(ఎం) కార్యకర్తల సమావేశంలో నాయకుల పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజా సమస్యలపై పోరాటాలే ప్రభుత్వాలను కదిలిస్తాయని సీపీఐ(ఎం) నాయకులు ఉద్ఘాటించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నామ్‌దేవ్‌వాడలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నగర కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, కార్యదర్శివర్గ సభ్యులు పెద్ద వెంకట్ రాములు మాట్లాడారు. పెట్టుబడిదారీ అనుకూల విధానాల మూలంగా పేదరికం మరింత పెరిగిందని, రెక్కాడితే కానీ డొక్కాడని పేదల సమస్యలు పరిష్కారం చేయటంలో ప్రభుత్వాలు విఫలమవు తున్నాయని అన్నారు. అందువల్ల సమస్యలపై పోరాటాల ద్వారా మాత్రమే ప్రభుత్వాలను వంచగలుగుతామని తెలిపారు. పేదలకు అవసరమైన కూడు, గూడు, గుడ్డ కల్పించడంలో సరైన విధానాలు అనుసరించకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయి పేదరికం పెరిగిపోతుందని ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చటానికి ప్రజల్లో వైశాల్యాలను పెంచి రాజకీయ లబ్ధి పొందాలని మతతత్వ విధానాలను అధికారాన్ని నిలబెట్టుకోవటా నికి బిజెపి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూ నిస్టులు బలపడినప్పుడే ప్రభుత్వా లను ప్రశ్నించ గలుగుతామని అందుకు కష్టజీవులను ఐక్యం చేయాలని వారు అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు

కేరళలో వచ్చిన వరదల మూలంగా వేలాది కుటుంబాలు నిరాశ్రయులుగా మారారని వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, అనేకమంది జాడ ఇంకా లభించలేదని, వారిని ఆదుకోవ టానికి మానవతావాదులు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు సుజాత, విగ్నేష్, నగర నాయ కులు కటారి రాములు, అనసూయ, నరసయ్య, రూరల్ నియోజకవర్గం లక్ష్మి, గోవర్ధన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేలాడితేనే.. ప్రయాణం

- సరిపడా బస్సులు లేక ఫుట్‌బోర్డుపై విద్యార్థుల ప్రయాణం
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బస్సు ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

ఆర్టీసీలో ప్రయాణం సుఖవంతం.. సుభప్రదం అని ఆ సంస్థ అధికారులు ప్రచారం చేసుకుంటారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. ఆర్టీసీ ప్రయాణం అంటేనే నరకప్రాయం ఇబ్బందికరం.. అని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగు ణంగా బస్సులు లేక తమ గమ్యస్థానానికి చేరేందకు అనేక ప్రయాసాల కోర్చాల్సి వస్తుంది. ఒక్కో బస్సులో పరిమితికి మించి రెండితల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక విద్యార్థుల ఇక్కట్లు మరింత పెరిగాయి. ఫుట్‌బోర్డు మీద వేలాడుతూ ప్రయాణం చేపట్టాల్సిన దుస్థితి నెలకొంది.

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. బాన్సువాడ పట్టణం నుండి వివిధ గ్రామాలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక నానావస్థలు పడుతున్నారు. ఒకే బస్సులో వంద నుంచి 150 మంది విద్యార్థులు ఒకే బస్సులో వెళ్లే పరిస్థితి ఏర్పడింది. బస్సు ఫుట్ ఫాత్ పై ప్రయాణం ప్రమా దకరమని తెలిసినప్పటికీ చేసేది ఏమీ లేక తప్పని పరిస్థితిలో బస్సు ప్రయా ణం చేయాల్సి వస్తుంది.

బాన్సువాడ పట్టణం లోని శనివారం తడ్కోల్ చౌరస్తా లో బస్సులు లేక ఒకే బస్సులో వందకు పైగా విద్యార్థులు ప్రయాణిం చారు. బీర్కూర్ నసుర ల్లాబాద్ మండలం పిట్లం తదితర మండలా లకు వెళ్లే విద్యార్థులకు నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల విద్యార్థులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. బస్సులు సమయానికి రాక, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కళాశాల విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక బస్సులు నడపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చేస్తున్నారు.

5571 పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి

- బదిలీ అయిన ఎస్జీటీలందరినీ రిలీవ్ చేయాలి
- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అసెంబ్లీలో గత ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ప్రకారం 5571 పిఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి సర్వీసు నిబంధనల జి.ఓ. 11 మరియు 12 లను సవరించి డిగ్రీ, బీఈడ్ అర్హతలతో నియామకమైన ఎస్జీటీ లకు కూడా పిఎస్ హెచ్‌ఎం పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్యుటిఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. సత్యానంద్, ఓ. రమేష్ డిమాండ్ చేశారు. నగరంలోని స్థానిక మల్లు స్వరాజ్యం ట్రస్టు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్యుటిఎఫ్) జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులందరిని వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసు నిబంధనల సవరణకు ముందు ఏర్పడిన స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, పిడి ఖాళీలను కామన్ సీనియారిటీ ప్రకారం ఎస్జీటీలకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఉపాధ్యాయ ఎమ్ఎల్సి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని గతంలో టీఎస్‌యూటీఎఫ్ చేసిన ప్రాతినిధ్యం పరిగణలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కాబట్టి తక్షణమే పి ఎస్, యుపిఎస్ లో పని చేస్తున్న టీచర్స్‌కు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. బకాయి పడిన ఆరు డిఎలను తక్షణమే విడుదల చేయాలని, పిఆర్సి రిపోర్టును తెప్పించుకుని ఫిట్‌మెంట్‌ను తేది: 01.07-2023 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. 317 జి .ఓ. వల్ల స్థానికత కోల్పోయిన టీచర్స్ అందరినీ సొంత జిల్లాలకు కేటాయించాలని, ట్రెజరీ ఆమోదం పొంది ఆర్థికశాఖ వద్ద మూలుగుతున్న బిల్లులను క్లియర్ చేయాలి కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిం చాలని, నూతన నియామ కాలు చేపట్టి ఖాళీలను భర్త చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కోర్టు కేసు క్లియర్ అయ్యేలా కృషి చేసి బదిలీల ప్రక్రియను పూర్తిచేయాలని, 010 ద్వారా వేతనాలు చెల్లించాలని అన్ని పాఠశాలల్లో పారిశుద్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, జిల్లా ట్రెజరర్ మల్లేష్, జిల్లా కార్యదర్శులు గంగాధర్, జనార్ధన్, రాజారాం, ఆనందం, బాబులు, జిల్లా కమిటి సభ్యులు శంకర్, గంగాధర్, లక్ష్మణ్, రాజేశ్వర్,రవీందర్, బాజన్న, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యానంద్

నూనెకారంతో విద్యార్థుల మధ్యాహ్న భోజనం

కొత్తపల్లి పాఠశాలను సందర్శించిన డీఈవో

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో శుక్రవారం నూనెకారంతో వేసి పెట్టడంతో ఆ విషయం వైరల్ కావడంతో జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్, మండల విద్యాధికారి నాగనాథ్, తహసిల్దార్ గంగాధర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, నాయకులు కృష్ణారెడ్డి తదితరులు ఆదివారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కారం పెట్టడంపై విచారణ చేపట్టారు. శుక్రవారం విద్యార్థులకు కూర మంచిగా లేకపోవడంతో కారం అడగడంతో నూనెకారం పెట్టామని నిర్వాహకురాలు పేర్కొనగా, జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలకు ఈ రకంగానే భోజనం పెడతావా, ఇష్టం లేకపోతే ఏజెన్సీ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమస్య మరోసారి పునరావృతం కావొద్దని పేర్కొన్నారు. ఈ విచారణలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కోట నరేష్, గౌతమి కూతురు కోట సిరి ఇటీవల విడుదల అయిన నీట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 1437 ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని సిరిని పట్టణ సామాజిక సేవకులు పట్వారీ తులసి కుమార్ ఆదివారం శాలువా, పూలమాలతో సన్మానం చేసి జ్ఞాపిక ను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోట సిరి మాట్లాడుతూ.. నీట్ టాప్ కళాశాలల్లో సీటు రావడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కార్డియాలజిస్ట్ డాక్టర్‌గా జిల్లాకు సేవలు అందిస్తానని అన్నారు. పట్వారీ తులసి సేవలు విద్యార్థులందరికీ ఆదర్శం అని అన్నారు.


విద్యార్థినికి సన్మానిస్తున్న పట్వారి తులసీ

ఇండోర్ స్టేడియానికి విరాళం అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం కోసం తన వంతు సహాయంగా ముప్కాల్ వాస్తవ్యులు తాజా మాజీ ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి దంపతులు రూ.30 వేల రూపాయల విలువగల 10 ఎల్‌ఈడి లైట్లను ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు అంజయ్యకు అందజేశారు. ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గంగాధర్ రెడ్డి, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు మోతె గంగారెడ్డి, జక్కుల ప్రవీణ్, నవీన్, సంజీవ్ థామస్, కనకయ్య గౌడ్, రాము, దాసరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.


విరాళంగా అందజేస్తున్న ఎల్‌ఈడీ లైట్లు

తొర్లికొండ గ్రామంలో పునుగు పిల్లి కళేబరం లభ్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయం మెట్ల దారిలోని బ్రహ్మంగారి ఆలయ ప్రాంతంలో పునుగు పిల్లి కళేబరాన్ని స్థానికులు గుర్తించారు. కాగా వెంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో పునుగుపిల్లి సంచరిస్తుందని, దానికి సంబంధించిన పిల్ల అయి ఉంటుందని పలువురు అనుమానిస్తున్నారు.


పునుగుపిల్లి కళేబరం

నేటి నుంచి 'స్వచ్ఛదనం-పచ్చదనం'

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంను సోమవారం ప్రారంభించనున్నట్టు మండల అభివృద్ధి అధికారి మహమ్మద్ ముజాఫరోద్దీన్ తెలిపారు. సోమవారం నుంచి 9 వరకు 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాలు యధావిధిగా కొనసాగించడం జరుగుతుందన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంను ప్రారంభించి, 6న తాగునీరు-వర్షపు నీటి సంరక్షణ, 7న డ్రైనేజీ-గుంతలు పూడ్చడం, 8న ఆరోగ్యం-వీధి కుక్కల బెడద, 9న ప్రభుత్వ సంస్థలు-బహిరంగ ప్రదేశాల శుభ్రతలపై కార్యక్రమాలు ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖల అధికారులు కార్యక్రమ సరళిని పాటించాలని సూచించారు.

7న ఉచిత సహాయ ఉపకరణాలు పంపిణీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

వికలాంగ విద్యార్థులకు ఈ నెల 07 న ఉచిత సహాయ ఉపకరణాలు పంపిణీ కోసం నిర్ధారణ శిబిరం జిల్లాకేంద్రం హౌసింగ్ బోర్డు కాలనీ(కేసీఆర్ కాలనీ)లో గల న్యూ యస్‌యస్.కన్వెన్షన్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్వి దుర్గాప్రసాద్, జిల్లా సహిత విద్య అధికారి పి.శ్రీనివాసరావు తెలిపారు. వికలాంగులకు అవసరం అయిన సహాయ ఉపకరణాలు అందించడానికి ఉచిత నిర్ధారణ శిబిరం ను జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఆలింకో ముంబాయి వారి ఆధ్వర్యంలో నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో జిల్లాలోని అన్ని మండలాల్లోగల 18 సంవత్సరాలలోపు వికలాంగులు శిబిరానికి హాజరు కావాలని కోరారు. దివ్యంగా విద్యార్థులకు వినికిడి యంత్రాలు, వీల్ చైర్,మూడు చక్రాల సైకిల్, చంక కర్రలు, కృత్రిమ అవయవాలు,అంధులకు అవసరం అయిన కేన్, 16 నుండి18 సంవత్సరాలు గల విద్యార్థులకు (శారీరక వికలాంగులకు) మూడు చక్రాల స్కూటర్, దృష్టి లోపం కలిగిన వారికి స్మార్ట్ మొబైల్‌లు కూడా అందించడానికి నిర్ధారణ చేస్తారని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొనే దివ్యాంగులు ఆధార్ కార్డు, సదరం ధ్రువపత్రం, ఆదాయ ధ్రువపత్రం లేదా రేషన్ కార్డు జిరాక్స్ పత్రం, రెండు ఫొటోలు, ఆదార్ కార్డ్ జిరాక్స్ వెంట తీసుకురావాలని సూచించారు. ఈ శిబిరానికి హాజరయ్యే పిల్లలకు తోడుగా తల్లి లేదా తండ్రికి రాను పోను బస్సు చార్జీలు, భోజన సౌకర్యం కల్పించిచనున్నట్లు జిల్లా సహిత విద్య అధికారి శ్రీనివాస్ రావు వెల్లడించారు. వివరాలకై జిల్లా సహిత విద్య అధికారి పి.శ్రీనివాస్ రావు ఫోన్ నెంబర్ 98660 71090ని సంప్రదించాలని తెలిపారు.

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా చౌట్‌పల్లివాసి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన కౌడు మహేష్ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ గా కొలువు సాధించాడు. ఆగస్టు 2న సిడిఎంఏ కార్యాలయంలో జరిగిన సభలో కమిషనర్ గౌతం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్‌లో జోనల్ స్థాయిలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఇందులో మండలంలోని చౌట్ పల్లి గ్రామానికి చెందిన కౌడు మహేష్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జోన్ 2లో)గా నియామక పత్రం అందుకున్నారు. మహేష్ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ గా ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం వ్యక్తం చేసి అభినందించారు.


నియామక పత్రం అందుకున్న మహేష్

జర్నలిస్టులకు వైద్య పరీక్షలు

- వైద్యులకు సన్మానం


వైద్యులను సన్మానిస్తున్న జర్నలిస్టులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని గంగ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అమృత్ రామిరెడ్డి ఆదివారం పట్టణంలోని జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించే జర్నలిస్టులు విధి నిర్వహణలో.. ఆరోగ్యం విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల గుండెపోటుతో ఆకస్మిక మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రూడెన్స్ హాస్పిటల్ వైద్యులు భైరవనాథ్, కార్డియాలజిస్ట్ గౌతంరెడ్డి, ఫిజీషియన్ చంద్రమోహన్, వంశీ తదితరులు జర్నలిస్టులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులను హాస్పిటల్ స్టాఫ్‌లను జర్నలిస్టుల ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

కలగానే స్లాబ్ కల్వర్టు నిర్మాణం

- రూ.50లక్షలు మంజూరు
- శంకుస్థాపన చేసిన ప్రశాంత్‌రెడ్డి
- ప్రభుత్వం మారడంతో నిధుల రద్దు
- గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

మండల కేంద్రం నుండి ఏర్గట్ల మండలం తడపాకల్ బీటీ రోడ్డుపై (వరద కాలువ) కిలో మీటరు 1/0-2 వద్ద స్లాబ్ కల్వర్టు ఈ ప్రాంత ప్రజల కలగానే మిగిలిపోయేలా ఉంది. సంవత్సరాల తరబడి ప్రజలు పడ్డ ఇబ్బందులను తీర్చేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి రోడ్డుభవనాల శాఖ మంత్రిగా ఉన్న వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.50లక్షలు మంజూరు చేయించారు. అంతేకాకుండా స్లాబ్ కల్వర్టు నిర్మాణం కోసం గత సంవత్సరం సెప్టెంబర్27న శంకుస్థాపన కూడా చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించే లోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు నిలిచిపోయ్యాయి. తీరా ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్తం ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు మంజూరు చేసిన పనులను నిలిపివేస్తు నిర్ణయం తీసుకోవడంతో స్లాబ్ కల్వర్టు పనులకు మంజూరైన నిధులు రద్దయ్యాయి. దీంతో స్లాబ్ కల్వర్టు నిర్మాణం ప్రజల కలగానే మిలిగిపోయింది. ప్రస్తుతం కల్వర్టు వద్ద బీటి రోడ్డు ప్రమాదాలకు ఆస్కారంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలక ువచ్చిన భారీ వరద నీటితో గతంలో కల్వర్టు గుంతల్లో పోసిన మొరం పూర్తిగా కొట్టుకుపోయి మారోమారు కల్వర్టు, బీటి రోడ్డు కోతలకు గురయ్యాయి.

మండల కేంద్రం నుండి ఏర్గట్ల మండలం తడపాకల్ వెళ్లే దారిలో వరద కాలువ దిగువన ఉన్న కల్వర్టు ఈ రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. కమ్మర్‌పల్లి గ్రామ శివారులో ఉప్లూర్ వెళ్ళే రోడ్డులో భూములు పల్లంగా ఉన్నందున వర్షపు వరద నీరు, పంట పొలాల నీరు ఉప్లూర్ వైపు ప్రవహిస్తోంది. పదేళ్ళ క్రితం కమ్మర్‌పల్లి శివారు గుండా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాలువ నిర్మాణం జరిగింది. కమ్మర్‌పల్లి వైపు నుండి వర్షపు వరద, పంట పొలాల నీరు దిగువకు ప్రవహించే మార్గం లేకపోవడంతో ఈ ప్రాంతాంలో పంట పొలాలు నీటమునిగాయి. రైతులు ఆందోళనతో అప్పట్లో అధికారులు వరద కాలువ కిందుగా అండర్ టన్నెల్ నిర్మించారు. ఈ టన్నెల్ గుండా బయటకు వెళ్ళే వరద నీరు, వరద కాలువ తూము వదిలితే వచ్చేనీరు ఉప్లూర్ చెరువులోకి ప్రవహించేందుకు వీలుగా బిటి రోడ్డు కిందుగా రెండు పైపులు వేసి కల్వర్టు నిర్మించి, కాలువ తవ్వారు. భారీ వర్షాలు కురిస్తే ఈ కాలువ గుండా నీటి ప్రవాహం జోరుగా ఉంటుంది. అయితే ప్రవాహంతోపాటు వచ్చే చెత్తచెదారం, మట్టితో పైపులు కూడా కొంత మేర మూసుకుపోయాయి. రెండేళ్ళ క్రితం వర్షా కాలంలో భారీ వర్షాలతో వచ్చిన వరద నీరు పైపుల్లో పట్టకపోవడంతో రోడ్డుపై నుండి ప్రవహించింది. దీంతో వరద తాకిడికి కల్వర్టు గోడలు పూర్తిగా విరిగి పడ్డాయి. దీంతో బిటి రోడ్డుపైన వర్షపు నీరు నేరుగా కాలువలోకి ప్రవహించి ఆ సమయంలో కల్వర్టు దిగువన గల పంట పొలాలు నీట మునిగాయి. అప్పటి నుండి కల్వర్టు మరమ్మత్తులకు నోచుకోనేలేదు. దీంతో భారీ వర్షాలు పడ్డ ప్రతిసారి క్రమంగా కల్వర్టు రెండు వైపుల గోడల భాగం నుండి బిటి రోడ్డు అంచు వరకు రోడ్డు కోతకు గురయ్యింది. బీటి రోడ్డు సగం వరకు కోతకు గురువ్వడంతో పాటు పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వరద ప్రవాహం ఎక్కువగా ఉండడం, కాలువ, కల్వర్టు కింద వేసిన పైపు చిన్నగా ఉండడంతో వరద నీరు బీటి రోడ్డు మీదుగా కల్వర్టు పైనుండి ప్రవహిస్తుంది. ఆ సమయంలో ఈ రోడ్డు గుండా ఇరు గ్రామాలకు రాకపోకలు సాగడం లేదు.ఇటివల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదకు గత సంవత్సరం గుంతల్లో నింపిన మొరం పూర్తిగా కొట్టుకుపోయింది.


స్లాబ్ కల్వర్టు నిర్మాణం చేపట్టాల్సిన ప్రదేశం

మొరం నింపి చేతులు దులుపుకుంటున్న అధికారులు...

గత కొన్ని సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు మొదటిసారి కల్వర్టు కోతకు గురయ్యింది. కల్వర్టుకు ఇరువైపులా పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. అప్పటినుండి ఆ గుంతలను అధికారులు తాత్కలికంగా మొరంతో నింపి చేతులు దూలుపేసుకుంటున్నారు. ఇలా భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వరద తాకిడికి గుంతల్లో వేసి మొరం కొట్టుకుపోవడం, అధికారులు వాటిని మొరంతో నింపి కవర్ చేయడం శరా మామూలుగా మారింది. గత రెండు సంవత్సరాల క్రితం కురిసిన అతి భారీ వర్షాలకు కల్వర్టుల నుండి బీటి రోడ్డు సగం వరకు పెద్ద ఎత్తున కోతకు గురై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో భారీగా వచ్చిన వరదతో కల్వర్టుల కాలువ కూడా కోతకు గురవ్వడంతో పంట పొలాల్లోకి వరద నీరు చేరి ఇసుక, మట్టి మేటలు వేశాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పుడు కూడా తాత్కలికంగా మళ్ళీ మొరంతో నింపి వదిలేశారే తప్ప అధికారులు శాశ్వత పరిషారం కోసం చర్యలు చేపట్టలేదు. గత సంవత్సరం వర్షా కాలంలో ఇదే పరిస్థితి ఏర్పడింది.


ప్రమాదకరంగా మారిన గుంతలు

పెద్ద ఎత్తున కల్వర్టులు ధ్వంసమై మరమ్మత్తులు చేపట్టకపోవడంతో రహదారి గుండా వెళ్ళే వాహనదారులు ప్రమాదాల భారీన పడుతున్నారు. గత సంవత్సరం ఈ గుంతలోకి ఒక కారు దూసుకెళ్ళి పల్టీ కొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినగా, అందులో ప్రయాణించిన వ్యక్తికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. కల్వర్టు దిగువన పంట పొలాలు భారీ వర్షాలు కురిసిన ప్రతి సందర్భంలో నీట మునుగుతున్నాయి.

రూ.50లక్షలు మంజూరు..

భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి కల్వర్టు వద్ద బీటి రోడ్డు గుంతల్లో పోసిన మొరం కొట్టుపోవడం పారిపాటిగా మారండంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రజల విన్నపాలతో గత ప్రభుత్వంలో రోడ్డు భవనాల శాఖ మంత్రిగా ఉన్న వేముల ప్రశాంత్ రెడ్డి స్పందించారు. ముఖ్యమంత్రి కేసిఆర్‌తో మాట్లాడి హైలెవల్ స్లాబ్ కల్వర్టు నిర్మాణం కోసం ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.50లక్షలు మంజూరు చేయించారు. పనులు ప్రారంభించేందుకు గత సంవత్సరం సెప్టెంబర్ 27న శంకుస్థాపన చేశారు. స్లాబ్ కల్వర్టు నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేసేందుకు అవసరమైన ఇసుక కూడా డంప్ చేసుకున్నాడు. దీంతో ప్రజలు సమస్య తీరిపోయిందని భావించారు. కానీ రాష్ట్రంలో శాసన సభ ఎన్నికలు రావడంతో మారిపోయింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మంజూరు చేసిన పనులను రద్దు చేయడంతో పనులు నిలిచిపోయాయి. శంకుస్థాపన శిలాఫలకం ఈ దారిన పోయేవారిని వెక్కిరించినట్లుగా ఉంది. డంప్ చేసిన ఇసుక ఇప్పటికీ అలాగే ఉంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఈ ప్రభుత్వం రద్దు చేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చలో అమృత్‌సర్ పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

అమృత్‌సర్‌లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని బిసి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కరిపే రవీందర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బీసీ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మహాసభల పోస్టర్స్‌ను ఉద్యోగ సంఘం గౌరవ సలహాదారులు ఆకుల ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం అధ్యక్షులు నరాల సుధాకర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీసీల డిమాండ్లను సాధించే దిశగా ఉద్యోగులందరూ ఏకం కావాలని అమృత్‌సర్‌లో ఈనెల 07న మహాసభ నిర్వహిస్తున్నారని తెలిపారు. బీసీ ఉద్యోగులందరూ ఐక్యంగా పోరాటాలు చేసి తమ హక్కులను డిమాండ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కరిపే రవీందర్ మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ లో రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ రద్దు చేయాలని, బీసీలకు అట్రాసిటీ కేసు నుంచి మినాయింపు ఇవ్వాలని, ప్రతి హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్లో ఒక బీసీ సెల్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. జిల్లాలోని బీసీలందరూ పాల్గొని ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు చిట్టి నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, కోశాధికారి విట్టల్ ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు సుమన్, శ్రీధర్, సంక్షేమ సంఘం నాయకులు కోయాడ శంకర్, బసవరాజ్, దర్శనం దేవేందర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



చలో అమృత్‌సర్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నషా ముక్తి భారత్ జిల్లా కమిటీ సభ్యునిగా రామ్మోహన్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

డ్రగ్స్, మత్తు, గంజాయి తదితర మాదక ద్రవ్యాలను నిజామాబాద్ జిల్లాలో అరికట్టేందుకు ప్రచారం చేసేందుకు జిల్లాస్థాయి కమిటీని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నియమించారు. కలెక్టర్ చైర్మన్, సిపి, మహిళా శిశు సంక్షేమ అధికారిని, వైద్యాధికారులు తదితరులతో పాటుగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కే రామ్మోహన్ రావును జిల్లా కమిటీ సభ్యునిగా నియమించారు.


రామ్మోహన్‌రావు

విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని భిక్కనూర్ సౌత్ క్యాంపస్‌లో శనివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థి ప్రీతం కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ యూనివర్సిటీ గిరిజన శక్తి అధ్యక్షుడు శ్రీను రాథోడ్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఒకే ఒక్క కొడుకును కోల్పోయి తల్లి దండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. విద్యార్థి కుటుంబాన్ని 25 లక్షల ఎక్స్‌గ్రేసియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కామారెడ్డి జిల్లాలోని బిక్నూర్ క్యాంపస్ నుంచి రోడ్డు దాటడానికి ఒక బ్రిడ్జి ని నిర్మించే విధంగా చూడాలని అయన అన్నారు.

పట్టణంలో స్వచ్ఛ కాలనీ కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో 56వ వారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుంకే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ట్రాక్టర్ రోడ్డో ఉన్న గుంతలు మూసేసి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారంతో నిండిన కుప్పలను తీసేసి నీరు నిలువ లేకుండా మురికి కాల్వలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శివరాజ్ కుమార్, కమిటీ ప్రతినిధులు కొక్కెర భూమన్న, గడ్డం శంకర్, ఎల్‌టి కుమార్, కాంతం రాజు, సాయన్న, ఎర్ర భూమయ్య రవి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

33శాతం మహిళా రిజర్వేషన్లు

అన్ని రంగాల్లో అమలు చేయాలి

- తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత



జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మోపాల్

33శాతం మహిళ రిజర్వేషన్లు అన్ని రంగాల్లో అమలు చేయాలని తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత, ముఖ్య అతిథి సరిత అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం నిజామాబాద్ డివిజన్ కమిటీ 7వ మహాసభను మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా పిఓడబ్ల్యు జెండాను మహిళ సంఘం సీనియర్ నాయకులు వేల్పూర్ లక్ష్మీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సరిత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో పెట్టిన మహిళా బిల్లు నేటికీ అమలుకు నోచుకోవడం లేదని, బిల్లు అలంకార ప్రాయంగా మారిందని, ఎన్నికల స్టంట్‌గా బిల్లు ఉపయోగపడటం విచారకరం అని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు మహిళలను ఎన్నికల స్టంట్లుగా ఉపయోగించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న పథకాలు కాదు.. మహిళలకు కావాల్సింది అన్ని రంగాల్లో సమాన హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు చట్టాలను అమలు చేయాలని కోరారు. మహిళ సాధికారత అంటే కొంత మంది డబ్బున్న కుటుంబాల మహిళలకు పెట్టుబడుల వైపు తీసుకుపోవడమే పరిష్కారం కాదని, అన్ని వర్గాల మహిళలను ఆర్థికంగా, సామాజికంగా, సమానత్వ అభివృద్ధి జరిగినప్పుడే మహిళ సాధికారత జరుగుతుందని అన్నారు. మరో వక్త సీపీఐ (ఎం ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, నిజామాబాద్ డివిజన్ కమిటీ కార్యదర్శి వేల్పూరు భూమయ్య మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాలలో సమాన వాటా కోసం పోరాటం చేసే వైపుగా మహాసభ నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. మహిళలు కుటుంబంలో ప్రధాన భాగం కాబట్టి మహిళా అభ్యున్నతే దేశ అభ్యున్నతని అన్నారు. జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ మాట్లాడుతూ మహిళలు లేని రంగమే లేదు.. ఐనా రెండవ శ్రేణి పౌరులుగా చూస్తున్నారని అన్నారు. ఉద్యోగాల్లో వివక్ష చూపుతున్నారని అన్నారు. ఈ పరిస్థితి మారాలంటే పోరాటమే శరణ్యం అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు భారతి, నిజామాబాద్ నగర అధ్యక్షురాలు నీలం లక్ష్మి,ప్రధాన కార్యదర్శి జి.సంజన డివిజన్ నాయకులు సబిత, అనంతక్క రాధ, రజిత, అనూజ, సునీత, లక్ష్మి , అగ్గు ఎర్రన్న, చిన్నయ్య, బండమీద నరసయ్య, జేపీ గంగాధర్, సాయినాథ్, సాయిరెడ్డి, కృష్ణ గౌడ్, గంగాధర్, దాసు, రజనీకాంత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని శ్మశాన వాటిక వద్ద మాజీ సర్పంచ్ తునికి వేణు ఆధ్వర్యంలో తునికి వంశ సోదరులు కీ.శే. తునికి నారాయణ-లక్ష్మి, తునికి సత్తయ్య-బాలమణి, తునికి విశ్వనాథం, తునికి సిద్దయ్య, తునికి లక్ష్మయ్య-లీల జ్ఞాపకార్థం వారి కుమారులు, మనుమల్లు 12 సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. అనంతరం శ్మశాన వాటిక ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తునికి వంశస్థులు తదితరులు పాల్గొన్నారు.



బెంచీలు వితరణ చేసిన దృశ్యం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

3

కామారెడ్డి

సోమవారం | ఆగస్టు 05, 2024 | www.navatelangana.com

వృథాగా తాగునీరు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహం సమీపంలో వాటర్ ట్యాంక్ నుంచి వచ్చే మంచినీరు వృథాగా పోతోంది. ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళల్లో వాటర్ ట్యాంక్ సమీపంలో గల పైప్ ద్వారా నీటిని పట్టుకుంటారు. నీటిని పట్టుకున్న తర్వాత పైప్‌ను మూసి వేయకుండానే వెళ్లిపోవడంతో నిత్యం నీరు వృథాగా పోతోంది. పంచాయతీ అధికారులు స్పందించి నీటివృథాను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



వృథాగా పోతున్న నీరు

పేరుకే క్రీడా ప్రాంగణాలు

- ప్రోత్సహించరు.. రాణిస్తే నెత్తినెట్టుకుంటారు
- పంచాయతీల్లో ములుగుతున్న క్రీడా పరికరాలు
- గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం కరువు
- క్రీడా ప్రాంగణాలను వినియోగంలో తేవాలని క్రీడాకారుల ఆవేదన



సాలూరలో పిచ్చిగడ్డి మొలిచి నిరుపయోగంగా మారిన క్రీడా ప్రాంగణం

నవతెలంగాణ-బోధన్

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామంలో వేల రూపాయల నిధులు వెచ్చించి క్రీడాప్రాంగణాలను ఏర్పాటుచేసింది. అంతేకాకుండా క్రీడాకారుల సౌకర్యార్థం క్రీడా పరికరాలను కూడా గ్రామ పంచాయతీలకు అందించారు. అంత వరకు బాగానే ఉన్నా.. ఆనాటి ప్రభుత్వం కానీ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కాని గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడం ఏనాడు చేయలేదు. కనీసం క్రీడాప్రాంగణాలను వినియోగంలోకి కూడా తీసుకురాలేదు. ఫలితంగా ప్రస్తుతం క్రీడాప్రాంగణాలు పిచ్చి మొక్కలు, పిచ్చిగడ్డి పెరిగి నిరుపయోగంగా మారాయి.

జిల్లాలో ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసినా.. అవి ఎవరికీ ఉపయోగపడలేదు. ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడా పరికరాలు వృథాగా మారాయి. గ్రామ విస్తీర్ణాన్ని బట్టి అధికారులు ఏయే క్రీడల సామగ్రి అవసరమో వాటిని ఆయా గ్రామాలకు పంపిణీ చేశారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, హైజంప్, లాంగ్ జంప్ లాంటి క్రీడా పరికరాలను పంపిణీ చేశారు. పలుచోట్ల ఖోఖో పోల్స్ ఏర్పాటు చేసి వదిలేశారు. మరికొన్ని చోట్ల క్రీడాప్రాంగణం బోర్డు తప్ప ఎలాంటి ఆనవాళ్లు లేవు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేదెవరు..

ఆటలలో ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించి వారిని గ్రామీణ క్రీడాకారుడిగా తీర్చిదిద్దడానికి శిక్షకులు తప్పనిసరి అవసరం. అలాగే వారికి అనువైన క్రీడాస్థలం ఉండాలి. అంతేకాకుండా ఎప్పటికప్పుడు ఆటలలో సాధనచేస్తే క్రీడాకారులను తయారుచేయొచ్చు. కానీ అవేమీ లేకుండా ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేసి చేతులు దులుపుకుంది. కనీసం క్రీడాపరికరాలు, క్రీడాప్రాంగణాలు యువకులకు ఎంతవరకు ఉపయోగపడ్డాయోనని ఏ అధికారీ పట్టించుకోలేదు.

బోధన్ పట్టణంలో సుమారు 800కు పైగా విద్యార్థులున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కనీసం పీడీ లేకపోవడం వలన విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. అయినా కూడా అధికారులు ఈ పాఠశాలకు పీడీనే నియమించలేదు. నాగన్‌పల్లిలో కంపోస్ట్ షెడ్డునే క్రీడాప్రాంగణంగా పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేసి అధికారుల పనితీరు ఎలా ఉందో చెప్పకనే చెప్పవచ్చు. కల్దుర్కిలో రాంపూర్ లోతట్టు ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఇలా క్రీడాప్రాంగణాలను నిర్లక్ష్యంగా ఏర్పాటుచేస్తే ఉత్తమ క్రీడాకారులు ఎలా తయారవుతారని యువకులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులు..

జిల్లా కేంద్రంలో క్రీడాకారులకు ప్రోత్సాహం నామమాత్రమే ఉన్నప్పటికీ.. క్రీడాకారులు వారి లక్ష్యానికి అనుగుణంగా పట్టుదలతో కష్టపడి వారు ఎంచుకున్న క్రీడలలో శిక్షణ పొంది నిష్ణాతులుగా ఎదిగారు. దాంతో మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో జిల్లా నుంచి ఎందరో క్రీడాకారులు వారి ప్రతిభను చూపారు. ముఖ్యంగా మహిళలలో క్రీడాకారులు తయారు కావడం కష్టం. కానీ యెండల సౌందర్య, నిఖత్ జరీన్, గుగులోత్ సౌమ్య లాంటి యువతులు వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ పొంది జాతీయస్థాయిలో పేరు సాధించారు. ప్రపంచమే తమ వైపు దృష్టిసారించేలా కష్టపడి పతకాలు సాధించారు. ప్రస్తుతం ఒలంపిక్ క్రీడల్లో సైతం నిఖత్ జరీన్ బాక్సింగ్‌లో ప్రపంచ స్థాయి క్రీడాకారులతో పోటీలో తలబడింది. దాంతో జిల్లా పేరును ఆమె ప్రపంచ స్థాయికి తీసుకెళ్ళింది. ఇలా జాతీయస్థాయి క్రీడాకారులుగా తయారు కావడానికి గ్రామీణ ప్రాంతాలలో ఎందరో క్రీడాకారులు ప్రోత్సాహం లేక శిక్షకులు లేక కనుమరుగైపోతున్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకువచ్చి క్రీడాకారులను ప్రోత్సహించి శిక్షణ ఇస్తే వారు కూడా రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదిగే అవకాశం ఉంది. కావున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి క్రీడాకారులను నిష్ణాతులైన శిక్షకులచే శిక్షణ అందించి ప్రోత్సహించాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

క్రీడలలో ప్రోత్సహిస్తే మరింత రాణిస్తాం



తాను చిన్న గ్రామంలో పుట్టిన తనకు ఆటలంటే ఇష్టం. దాంతో చదువుతోపాటు ఖోఖో ఆడుతూ ఇంటర్నేషనల్ స్థాయికి ఎదిగాను. మా గ్రామంలో ఎలాంటి క్రీడా ప్రాంగణం లేదు. అంతేకాకుండా మాలాంటి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేవారు లేరు. అధికారులు స్పందించి గ్రామాలలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇవ్వాలి. దాంతో మేము కూడా జాతీయస్థాయిలో రాణించి దేశానికి పథకాలు తెస్తాం. తాను కష్టపడి ఖోఖో ఆడుతూ ఇంటర్నేషనల్ స్థాయిలో ఎదిగాను. అయినా తనకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదు.

- సుమన్ ఇంటర్నేషనల్ ఖోఖో ప్లేయర్

క్రీడాప్రాంగణాలను బాగు చేయాలి



ప్రభుత్వం గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అణువుగా లేవని పిచ్చి మొక్కలు పెరిగి అస్తవ్యస్తంగా తయారయ్యాయని వాటిని సక్రమంగా బాగుచేసి క్రీడాకారులకు అనుగుణంగా ఉండేలా మార్చాలి. క్రీడ ప్రాంగణాలు ఏర్పాటు చేసినా.. మాలాంటి యువతకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. గ్రౌండ్ సక్రమంగా లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి క్రీడాకారులు శిక్షణ పొందవలసి వస్తుంది. అధికారులు స్పందించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి.

- కన్నె, భీమేష్, సాలూర.

ఆలయ భూమి కబ్జాకు ప్రయత్నం

- ఆలయం కోసం నాలుగు గుంటల భూమి దానం చేసిన వ్యక్తులు
- రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొని ప్లాట్లుగా చేస్తున్న వైనం
- అడ్డుకుంటామంటున్న గ్రామస్తులు



కబ్జాకు గురవుతున్న భూమి ఇదే

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని శివారు చుక్కాపూర్ గ్రామ శివారులో గల వీరాంజనేయ స్వామి గుడికి కొన్ని సంవత్సరాల క్రితం ఆలయం గుడి పక్కనే ఉన్న భూమి యజమానులు ఆలయం కోసం నాలుగు గంటల భూమిని ఆలయానికి దానంగా ఇచ్చారు. ప్రస్తుత ఆ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి కబ్జాకు ప్రయత్నం చేస్తున్నారని మాచారెడ్డి, చుక్కాపూర్ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ భూమి క్రయవిక్రయాలు జరగక నాలుగో వ్యక్తి నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేసి గుడికి గతంలో ఇచ్చిన భూమిని సైతం తమకు ఆన్లైన్లో వచ్చిందని తాము గుడికి ఇచ్చేది లేదని ప్లాట్లుగా చేసే విక్రయించేందుకు ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గుడి పక్కనే రెండు ప్లాట్ల స్థలం ఉందని ఆ ప్లాట్లను ఎవరు కూడా కొనుగోలు చేయవద్దని గ్రామస్తులు తెలుపుతున్నారు. కాదని ఎవరైనా కొనుగోలు చేస్తే గుడి జాగా కోసం కొట్లాడుతామని వారు పేర్కొంటున్నారు.

రుణమాఫీకి మెలికలు పెట్టడం సరికాదు

- ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ వనం సుధాకర్

నవతెలంగాణ-కామారెడ్డి

రుణమాఫీ కోసం మెలికలు పెట్టడం సరికాదని ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ వనం సుధాకర్ విమర్శించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎంసిపిఐయు పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సమావేశాన్ని కామ్రేడ్ ఓర్సు నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ కేంద్రకమిటీ సభ్యులు వనం సుధాకర్ హాజరై మాట్లాడుతూ రైతు రుణమాఫీ గత భారత ప్రభుత్వం చేసినట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని విమర్శించారు. ఎక్కడైతే రైతులు ఉన్నారో, ఎక్కడైతే విద్యార్థులు ఉన్నారో అక్కడ వాళ్లకు అనుకూలంగా బడ్జెట్ పెట్టకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. నోట్లో బెల్లం పెట్టి కడుపులో కారం కొట్టిన విధంగా బడ్జెట్ ఉందని ఎద్దేవా చేశారు. రుణమాఫీ చేస్తామని చెప్పినప్పటికీ అనేక మెలికలు పెట్టి రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేటికీ రుణమాఫీ చేయకుండా రైతులను నానా ఇబ్బందులకు గురిచేస్తుందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకుంటే రాష్ట్రవ్యాప్తంగా కామారెడ్డి నుంచి మొదలుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు స్వామి, సుజాత, నాగరాజ్, లీల, భార్గవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు విస్తరణకు మోక్షం

- ఈసారైనా పనులు పూర్తయ్యేనా..?
- నేడు మరోసారి సెంట్రల్ లైటింగ్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



మండల కేంద్రంలోని ప్రధాన రహదారి

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలో రూ.12 కోట్ల నిధులతో 1.7 కిలోమీటర్లు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఆర్అండ్‌బీ డిఈ కిషన్ తెలిపారు. ఇందులో మూడు కోట్లతో ఎలక్ట్రికల్ వర్క్స్, మిషన్ భగీరథ పనులు, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. రెండు కోట్లతో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణ పనులు చేయనున్నట్లు డిఈ తెలిపారు.

ఈసారైన రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యేనా..?

గత సంవత్సరం 12 కోట్ల నిధులతో రోడ్డు విస్తీర్ణం పనులకు టెండర్ కాగా ఫిబ్రవరి 15, 2023 నాడు అప్పటి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే హనుమంత్‌షిండే భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రధాన రహదారిని నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం కోసం ఆర్అండ్‌బి అధికారులతో కలిసి రోడ్డు మధ్యలో నుంచి ఇరువైపులా 50 ఫీట్ల చొప్పున హద్దులు నిర్ణయించి చింతలగల్లి గుర్రపు బొమ్మ నుంచి అంబేద్కర్ చౌరస్తా అవతలి కల్వర్టు వరకు మార్క్ చేశారు. మండల కేంద్రానికి చెందిన వ్యాపారస్తులు, ప్రజలు రోడ్డు విస్తీర్ణ హద్దులు రోడ్డు మధ్యలో నుంచి 48 ఫీట్లకు నిర్ణయించాలని అప్పటి ఎమ్మెల్యే హనుమంత్ షిండేకు విన్నవించడంతో ఆర్అండ్‌బి అధికారులు, కాంట్రాక్టర్ 48 ఫీట్ల వరకు రోడ్డు విస్తీర్ణం చేయడానికి నిర్ణయించారు. హడావుడిగా పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ నాలుగు వరుసలలో రోడ్డు విస్తీర్ణానికి రెండు పక్కల దుకాణ సముదాయాలను, రోడ్డును తవ్వేసి వదిలిపెట్టారు. పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తుండడంతో వాహనదారులు, ప్రజలు మండల కేంద్రంలోని రహదారిపై వెళ్లాలన్న తీవ్ర ఇబ్బందులు పడుతూ అవస్థలు పడ్డారు.

తదనంతరం ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో నూతనంగా గెలుపొందిన జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు.. నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టడానికి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో టెండర్ రద్దుచేసి రీటెండర్ నిర్వహించారు. రోడ్డు విస్తీర్ణం సెంట్రల్ లైటింగ్ పనులకు రీటెండర్ నిర్వహించడంతో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు 11 మార్చ్ 2024 నాడు భూమిపూజ సెంట్రల్ లైటింగ్ రోడ్డు విస్తీర్ణం డ్రైనేజీ నిర్మాణం పనులను ప్రారంభిం చారు. రెండోసారి టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టకపోవడంతో స్థానిక ప్రజలు పనులు మొదలు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు, ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ఎట్టకేలకు ఆర్అండ్‌బి అధికారులు సోమవారం పనులు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడంతో ఈ సారైనా రోడ్డు విస్తీర్ణ పనులు సెంట్రల్ లైటింగ్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పనులు ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరగా పూర్తి అయ్యేటట్లు చూడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తూ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

జీపీ కాంప్లెక్స్‌పై జిల్లా అధికారుల నిర్లక్ష్యం



జీపీ కాంప్లెక్స్ భవనం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 2017 సంవత్సరంలో 23 గదులను నిర్మించి వేలంపాట వేయగా వేలంలో ఒక కోటి 26 లక్షల 90 వేల రూపాయలు వేలం పాటలో పలుకగా అందులో 12 గదులను దక్కించుకున్న వారు 97లక్షల 84 వేల రూపాయలు చెల్లించగా మిగతా 11 గదులు దక్కించుకున్న వారు 29 లక్షల 6వేల రూపాయలు నేటికీ చెల్లించలేదు. ఏడు సంవత్సరాల నుంచి ఇటు పంచాయతీ అధికారులు అటు జిల్లా అధికారులు సైతం గదులకు కిరాయిని నిర్ణయించకపోవడం, 11 గదులను రక్షించుకున్న వారి నుంచి డబ్బులు వసూలు చేయకపోవడంపై అధికారులు గ్రామపంచాయతీకి వచ్చే ఆదాయంపై ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది. 7 సంవత్సరాల నుంచి కోటి రూపాయలకుపైగా పంచాయతీ ఆదాయానికి గండిపడుతున్నా.. పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ధ్రువపత్రాల కొరకు పంచాయతీకి వెళ్లి తీసుకోవాలన్న, ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇతర అవసరాలు కొరకు వెళ్లినా.. ఇంటి పన్ను చెల్లించే వరకు పనులు చేయని అధికారులు కళ్ళముందు ఎలాంటి కిరాయి చెల్లించకుండా ఏడు సంవత్సరాల నుండి పంచాయతీ ఆదాయానికి గండి పడుతున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఇటు మండల అధికారులను అటు జిల్లా అధికారులను పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలోనే జిల్లా కలెక్టర్ గదులకు కిరాయి నిర్ణయించి పూర్తి డబ్బులు చెల్లించని వారి నుంచి డబ్బులు వసూలు చేయాలని చెల్లించని వారి వేలం పాటను రద్దుచేసి మరోసారి వేలంపాట వేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఎలాంటి కిరాయి చెల్లించకుండా గదులను ఉపయోగించుకుంటున్న వారిని చూసి ఇతర పంచాయతీ భవనాలలో ఉంటున్న వారు సైతం కిరాయి చెల్లించామని తెలియజేస్తున్నట్లు సమాచారం. గ్రామపంచాయతీ నిధులు, ఆదాయం దుర్వినియోగం అవుతున్నా.. జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి కిరాయి నిర్ణయించి చెల్లించని వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తారా..?, తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది.

ఇసుక డంపు సీజ్

- నేడు వేలం

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని హంగర్గఫారం శివారు ప్రాంతంలో మెయిన్ రోడ్ పక్కన ఆదివారం ఉదయం 11 గంటలకు, దాదాపు 16 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమంగా నిలువచేసిన ఇసుక డంపును గుర్తించి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మండల కార్యాలయంలో వేలం వేయనున్నట్టు తహసీల్దార్ జె.మల్లయ్య తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5000 డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీటీసీ



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎంపీటీసీ

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఎంపీటీసీల ఫోరం యూనియన్ ఎడపల్లి మండలాధ్యక్షులు (కుర్నాపల్లి మాజీ ఎంపీటీసి) ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వెంకయ్యగారి రామిరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా శాలువాతో సన్మానించారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుని జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండలాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జై గౌడ ఉద్యమం కార్యాలయంలో ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడానికి అన్నివేళలా ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైగౌడ జిల్లా అధ్యక్షులు మురళిగౌడ్, సిద్దాగౌడ్, హరీష్, భాస్కర్, నర్సింలు, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'హనుమంత్ యాదవ్‌ను గెలిపించాలి'

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలానికి జరుగుతున్న యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో హనుమంతు యాదవ్ గెలుపు కోసం యువకులు కృషి చేయాలని జుక్కల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు బాలు యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఐవైసీ యాప్ ద్వారా జరగబోయే యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో హనుమంత్ యాదవ్‌కు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీ కాంతారావు మెచ్చిన వ్యక్తి అని.. నిరంతరం ప్రజా సమస్యలపైన ప్రశ్నించే నాయకుడని తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న యువ నాయకుడు పదవికి సరైన న్యాయం చేయగల సత్తా ఉన్న వ్యక్తి అని వివరించారు. హనుమంత్ యాదవ్‌కు పూర్తిగా మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు.

బీబీపాటిల్ ఆధ్వర్యంలో రైతు సహాయక కేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-పోతంగల్

రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతు సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు మాజీ ఎంపీ బీబీపాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ఎవరికైనా రుణమాఫీ, రైతు భరోసా అందని రైతులుంటే.. 888100097 నెంబర్‌కు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెలిపాలని సూచించారు.

తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శిగా నీరడి ఈశ్వర్



నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శిగా ప్రముఖ న్యాయవాది నీరడి ఈశ్వర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య ఆదివారం నియామకం ప్రకటన జారీ చేసినట్లు ఈశ్వర్ తెలిపారు. భవిష్యత్తులో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరగబోయే ఉద్యమ కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషించాలని చెన్నయ్య ఆదేశించినట్లు తెలిపారు. గత రెండు మూడు సంవత్సరాలుగా ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి ఎస్సీ ఎస్టీల సమస్యలపై ఉద్యమించడంలో న్యాయవాది నీరడా ఈశ్వర్ కీలక వ్యక్తిగా పనిచేశారు. దాంతో ఆయన పాత్రను గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఆయన నియామకం పట్ల మాల మహానాడు శ్రేణులు హర్షణ వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

గొట్టుముక్కల విద్యార్థినికి నీట్‌లో 6,017 ర్యాంక్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని గొట్టుముక్కల గ్రామానికి చెందిన రాజ్ కుమార్, లక్ష్మి దంపతుల కూతురు కళ స్వినికి నీట్ ఫలితాల్లో 6,017 ర్యాంక్ వచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. ప్రభుత్వం శనివారం విడుదల చేసిన పలితల్లో కళశ్వినికి 6,017 ర్యాంకు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కళశ్విని గ్రామస్తులు అభినందించారు.


విద్యార్థికి స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

అరుదైన తుంటి ఎముక శస్త్ర చికిత్స విజయవంతం

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని శ్రీ శివ సాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో అరుదైన తుంటి ఎముక శస్త్ర చికిత్స విజయవంతమైనట్లు డైరెక్టర్ పోడేండ్ల సాయికుమార్ తెలిపారు. మండలంలోని ఛేంగల్ గ్రామానికి చెందిన లింబాయి తుంటి ఎముక వల్ల తీవ్ర ఇబ్బందులకు గురై పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగిందని, తమను సంప్రదించడంతో పరీక్షించి తుంటి భాగంలో బోను అరిగిందని నిర్ధారించి శస్త్ర చికిత్స చేసినట్లు సాయికుమార్ తెలిపారు కార్పొరేట్ సెంటర్లో చేసే ఆపరేషన్‌ని అతి తక్కువ ఖర్చులో విజయవంతం చేసినందుకు కుటుంబ సభ్యులు ఆనంద వ్యక్తం చేసి డాక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆపరేషన్ లో హాస్పిటల్ మేనేజ్మెంట్ డైరెక్టర్ పోడెండ్ల సాయికుమార్ యాదవ్, డాక్టర్ లింగమూర్తి, ఎంఎస్ ఆర్తో జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్, ఎంఎస్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సూర్యనారాయణ, జనరల్ డాక్టర్ అనిల్ కుమార్, హాస్పిటల్ స్టాప్ షాబుద్దీన్, రాజు, నరేష్, సాయి, మౌనిక, అవంతిక, నందిని, తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ రైటర్‌గా తొగర్ల సురేష్

నవతెలంగాణ-ముప్కాల్

సంగీత సాహిత్య నృత్య సేవా కళ సమ్మేళనం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పురస్కారాల వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ముప్కాల్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న తొగర్ల సురేష్‌ను రాష్ట్రస్థాయి ఉత్తమ రైటర్‌గా ఎంపిక చేసి అవార్డును ప్రధానం చేశారు. ఏఎస్సై తొగర్ల సురేష్ అనేక రకాల రచనలను రచించారు. అనేక కార్యక్రమాల్లో ఎన్నో అవార్డులు అందుకున్నారు. స్థానిక పోలీస్ సిబ్బందితో పాటు పలువురు ప్రముఖులు సురేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు..

పీవోడబ్ల్యూ నిజామాబాద్ నగర కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన నగర కార్యవర్గం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పిఓడబ్ల్యు నిజామాబాద్ నగర 7 వ మహాసభ నగరంలో కోటగల్లి లో ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రగతిశీల మహిళా సంఘం(పి ఓడబ్ల్యు) నగర అధ్యక్షురాలుగా నీలం లక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఆకుల సబిత, ప్రధాన కార్యదర్శి గొంట్యాల సంజన, సహాయ కార్యదర్శిగా శాంతక్క, కోశాధికారిగా పొన్ను మానస, కార్యవర్గ సభ్యులుగా ఉమారాణి, రాజ్యలక్ష్మి, తంకడి రేఖ, మశాల్కర్ సురేఖ, ఆనంతక్క, వనమాల మాధవి, గంగా, పావని, లక్ష్మిని మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ తెలిపారు. ఈ మహాసభలో పలు తీర్మానాలను చేశామని అన్నారు. మద్యానికి వ్యతిరేకంగా ,అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా, స్త్రీ పురుష సమానత్వం కోసం , స్వయం నిర్ణయాధికార స్వేచ్ఛ కోసం పోరాడాలని , నగరంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నం

ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ


తనను కలిసేందుకు వచ్చిన వారితో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పట్టణ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకున్నామనితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా పట్టణంలో పలు డివిజన్లలో సిసి రోడ్, డ్రైనేజ్, పలు కమ్యూనిటీలకు కాంపౌండ్ వాల్ అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రితో చర్చించి 10 కోట్ల రూపాయలు తీసుకొచ్చామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందని అన్నారు. మహిళలకు ప్రత్యేకంగా ఉచిత బస్సు ప్రయాణం రూ.500 గ్యాస్ సిలిండర్ అందించి ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు వాగ్దానాల్లో ఐదు నెరవేర్చామని తెలిపారు. త్వరలో పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు, ప్లాటు ఉన్న వాళ్లకి కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తామన్నారు. నిజామాబాద్ పట్టణాన్ని అమృత్ నిధుల ద్వారా 300 కోట్ల రూపాయలు పట్టణానికి తీసుకువచ్చి నీటి సమస్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్య తీర్చి స్మార్ట్ సిటీగా తీర్చి దిద్దుతానన్నారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్‌లో ఆదివారం పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు షబ్బీర్ అలీని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

బాలికపై లైంగికదాడి చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలి


ఆర్థికసాయం ప్రొసీడింగ్ అందజేస్తున్న షబ్బీర్

అభం శుభం తెలియని పసి బాలికపై అత్యాచారం చేసిన కామాంధున్ని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో పట్టణంలోని ఆరు సంవత్సరాల బాలికపై అత్యాచారం చేసిన గంగాధర్ అనే యువకుడిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ సలహాదారు కోరారు వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ప్రభుత్వం నుండి రావలసిన ఎక్స్‌గ్రేషియా త్వరలో అందే విధంగా అధికారులను ఆదేశించారు. బాలిక కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ దృష్టికి తీసుకురాగా వారు విషయం తెలుసుకొని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా సీపీతో ఫోన్లో మాట్లాడి నిందితుడిని కఠినంగా శిక్ష పడేవిధంగా చర్యలు చేసుకోవాలని కోరారు. మహిళా శిశు సంక్షేమ అధికారితో ఫోన్లో మాట్లాడి బాధితులకు వెంటనే తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. అలాగే బార్ కౌన్సిల్లో మాట్లాడి ఇలాంటి కామాంధుల తరపున ఏ న్యాయవాది కూడా వకాలత్ తీసుకొని వాదించకూడదని కోరారు. బాధిత బాలికకు ఆసుపత్రిలో అయ్యే వైద్య ఖర్చు కూడా భరిస్తానని తక్షణ సహాయం అందజేశారు వారి కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు.

మాజీ మంత్రిని పరామర్శించిన పొద్దుటూరి

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి మాజీ మంత్రి సంతోష్ రెడ్డిని ఆదివారం పరామర్శించారు. మాజీ మంత్రి సంతోష్ రెడ్డి అనారోగ్యానికి గురయ్యారన్న విషయం తెలుసుకున్న ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహమేర శాశ్వతం

• ఘనంగా స్నేహితుల దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి ఒక్కరి జీవితంలో మంచి స్నేహితుడు చాలా ముఖ్యమని పట్టణానికి చెందిన బాలాజీ జ్యువెలర్స్ యజమానులు శ్రీరామ్ కిషన్, సంతాని మోహన్ లు అన్నారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నవ తెలంగాణతో మాట్లాడారు .గత 45 సంవత్సరాలుగా పట్టణంలో జ్యువెలర్స్ షాపు నిర్వహిస్తూ, పలువురికి ఆదర్శంగా నిలిచినామని మంచి స్నేహితుల సన్నిహిత్యం దొరికితే జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఛేదించవచ్చని, జీవితాన్ని ఉత్తమంగా ఆస్వాదించ వచ్చని, మంచి స్నేహితుడు ఉంటే ఏ ఒత్తిడి మన దరి చేరదని అన్నారు. మంచి స్నేహితులను సంపాదించుకొని జీవితాన్ని ఆనందంగా గడపాలని తెలిపారు.

పట్టణంలో జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్నేహితులు ఒకరినొకరు ఫ్రెండ్‌షిప్ బంధన్‌లు కట్టుకొని మిఠాయిలు తింటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆర్మూర్ ట్రాఫిక్ సిఐవోడి రమేష్ మాట్లాడుతూ.. ఫ్రెండ్షిప్ అనేది చాలా పవిత్రమైన బంధమని స్నేహితుల ద్వారా నిత్యజీవితంలో ఎంతో ఆనందం, ఉత్సాహం లభిస్తుందని అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి మాట్లాడుతూ స్నేహానికి ఎలాంటి కుల మత బేధ భావం ధనిక పేద లాంటి ఏమాత్రం తారతమ్యం ఉండదని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆదర్శ్ మాజీ అధ్యక్షులు డిజె దయానంద్, లయన్స్ క్లబ్ గ్రీన్ జోన్ చైర్మన్ చేపూర్ గణేశ్, రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ మాజీ అధ్యక్షులు విద్యా ప్రవీణ్, బొచ్కర్ వేణు, బేల్దార్ శ్రీనివాస్, గోపి, విశాల్, కాశినాథ్ పాల్గొన్నారు.

కంఠేశ్వర్: స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అని, జీవితంలో కోట్లు సంపాదించిన కలగని ఆనందం ఒక మంచి స్నేహితుడిని పొందితే కలుగుతుందని విశ్రాంత ఆచార్యులు సేర్ల దయానంద్ అన్నారు. తమ స్నేహం బంధం 59 ఏళ్లనాటిదని, సేర్ల దయనంద్ విశ్రాంత ఆచార్యులు, గడ్డం దీరెందర్ రెడ్డి, నిజామాబాద్. వీరిరువురు మంచి స్నేహితులు. వీరు 6 వ తరగతి నుండి నిజామాబాద్ శ్రీ నూతన వైశ్య పాఠశాల - మాణిక్ భవన్‌లో హెచ్‌ఎస్‌సీ వరకు చదువుకున్నారు. తర్వాత బీకాం జీజీ కాలేజీలో ఎంకాం ఇతర కాలేజీలో చదువుకున్నారు. వీరు రూమ్ మెంట్స్. వారి స్నేహం కాలానికి అతీతమైనది. సేర్ల దయానంద్ జీజీ కాలేజీ, నిజామాబాద్ లో హెచ్‌ఓడి కామర్స్ గా పని చేసి రిటైర్ అయ్యారు. గడ్డం ధీరెందర్ రెడ్డి ఆంధ్రబ్యాంక్ వినాయక్ నగర్‌లో మేనేజర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. 59 ఏళ్ల స్నేహం చాల బాగుంది. విభిన్నరంగాల్లో ఉద్యోగాలు చేసిన వీరిది ఒకే మాట.. ఒకే బాట.. వీరిద్దరు ప్రస్తుతం విశ్రాంత జీవితాన్ని నిజామాబాద్ లోనె గడుపుతున్నారు. అభిప్రాయాలు, ఆలోచనలు ఒకటే ప్రస్తుతం విశ్రాంత జీవితంలో వీరు పాత జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరువేసుకుంటున్నారు. వీరిద్దరు కలసి సామాజిక సేవలను చేస్తుంటారు. భగవద్గీత ప్రచారం చేయడం, భగవద్గీత ధ్యానం, యోగ తరగతులకు హాజరవుతారు. వాకింగ్ నిత్యం కలిసే చేస్తుంటారు. శబ్ద తరంగిణి సంస్థను ఏర్పాటు చేసి మొక్కలు నాటడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇప్పటివరకు కలిసి ఉండడం ఆనందంగా ఉందని ఇరువురు మిత్రులు తెలుపుతున్నారు. తమ స్నేహంతో తమ జీవితకాలం పెరిగిందని తెలిపారు. స్నేహం ఎక్కువ కాలం ఉండాలంటే సర్దుకుపోయే స్వభావం ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికి స్నేహితుల దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇద్దరు మిత్రులు కలుసుకొని పుస్తకాలను స్నేహానికి గుర్తుగా ఇచ్చిపుచ్చుకున్నారు.


కంఠేశ్వర్ : స్నేహితునికి బుక్ అందజేస్తున్న స్నేహితుడు



సిరికొండ : ఫ్రెండ్‌షిప్‌డే ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

సిరికొండ : కష్ట సమయంలో కలత చెందిన మనసుకి ప్రశాంతతను కలిగించే దివ్య ఔషధం స్నేహమని, అమ్మ అనే పదం తర్వాత ఆత్మీయతను ధ్వనింపజేసే ఏకైక పదం స్నేహమని, ఆత్మీయత, అనుబంధాలకు ప్రతిరూపం స్నేహబంధమని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య తెలిపారు. ప్రతి సంవంత్సరం ఆగష్టు మాసం మొదటి ఆదివారం జరుపుకునే స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యశోధక్ పాఠశాలలో విద్యార్థులు "హ్యాపీ ఫ్రెండ్షిఫ్ డే " అనే ఆంగ్ల అక్షరాల నమూనాలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపారు. ఏ బంధం లేకున్నా స్నేహమనే బంధంతో ముడిపడి పరిణతి చెందుతూ కాలక్రమేణా బలమైన బంధంగా మారి అన్నింటికి చేయుత నిచ్చేదే నిజమైన స్నేహ బంధమన్నారు. వ్యక్తిగత జీవితంలో ఎదుగుదలకు వ్యక్తిగత నిర్మాణానికి, మానవీయ విలువలు పెంపొందింపచేయడంలో స్నేహితుల పాత్ర ప్రధానమైనదన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

బాల్కొండ : మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్రెండ్‌షిప్ బెల్ట్ కట్టారు. అనంతరం క్లబ్ సభ్యులు కలిసి పూల మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అందే వెంకట గిరి, సెక్రటరీ ద్యావతి పోశెట్టి, ట్రేజరర్ కటికె శ్రీనివాస్, సభ్యులు భూస రత్నాకర్, కళ్యాణ్ రాజేందర్, మెడికల్ నరేందర్, డా. రాజు, వీరయ్య, శ్రీనివాస్, ప్రవీణ్, తాళ్ల పద్మనాభం పాల్గొన్నారు.


ఆర్మూర్ : జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం..


ఆర్మూర్ : స్నేహితులు శ్రీరాం కిషన్, సంతాని మోహన్



బాల్కొండలో మొక్కలు నాటుతున్న క్లబ్ సభ్యులు

అబ్బపూర్‌లో ఘనంగా తీజ్ పండుగ

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని అబ్బాపూర్ (బి) తండాలో గిరిజనుల పండుగ తీజ్ ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆషాడపు చివరి అమావాస్య కావడంతో గ్రామంలోని గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అందరూ కలిసి జగదంబ ఆలయంలో గిరిజనుల సాంప్రదాయ వేషాధారణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగదంబ మాతకు తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేకలను బలిచేసి అందరూ కలిసి భోజనాలు చేశారు. మహిళలు, యువతులు సాంప్రదాయం నృత్యాలు చేసి తమ భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో కైలాష్ నాయక్, జ్యోతి శోభన్, పీర్ సింగ్, బాదావత్ రవి, కోలా జగ్గారం, మరియు మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


తీజ్ బుట్టలతో వచ్చిన యువతులు, పాల్గొన్న మహిళలు

దశాబ్దాలుగా పాత భవనమే ..

• శిథిలావస్థలో వేల్పూర్ పశువైద్యశాల

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

గత నాలుగు దశాబ్దాల క్రితం మండల కేంద్రంలో నిర్మించిన పశు వైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇందులో విధులు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది భయపడుతున్నారు. కాగా సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండలానికి ఒక ఆసుపత్రి చొప్పున నిర్మించారు. ఆ తర్వాత నాలుగైదు గ్రామాలకు ఒక ఆస్పత్రి చొప్పున నిర్మించారు. మండల కేంద్రంతో పాటు పచ్చల నడుకుడ, పడగల్ గ్రామాల్లో సొంత భవనాలు ఉన్నాయి. ఇదే మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో ఆసుపత్రికి సొంత భవనం లేదు. సుమారు రెండు దశాబ్దాల నుంచి వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, వ్యవసాయ పనులు చేసే వారు తగ్గుతుండడం వల్ల పశుసంపదను సైతం రైతులు తగ్గిస్తూ వస్తున్నారు. గతంలో ఇంటికి నాలుగైదు గేదెలు, రెండు జతల ఎడ్లు ఉండేవి. కొందరు ఆవులు సైతం పెంచేవారు. రాను రాను వ్యవసాయ లో యంత్రాల వాడకం విపరీతంగా పెరగడం, పశువుల పోషణ భారంగా భావించడంతో పశుసంపద తగ్గిపోయింది. దీంతో ప్రభుత్వాలు సైతం పశువుల ఆసుపత్రులను సైతం పట్టించుకోవడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. మండల కేంద్రంతో పాటు మోతే, అక్లూర్, అమీనాపూర్, లక్కోరా, వెంకటాపూర్, కోమన్ పల్లి, కుకునూర్ గ్రామాల పశువులకు వైద్య సేవలు అందుతాయి. ప్రభుత్వం నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాల ద్వారా గ్రామాలకు వెళ్లి పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. పశువులకు ఉచిత దాన, ఉచిత గడ్డి విత్తనాల స్టాకు వంటివి సరఫరా చేసినప్పుడు ఆసుపత్రిలో నిల్వ చేయాల్సి వస్తుంది. వర్షాలు కురిసినప్పుడు దాన, విత్తనాలు సైతం తడిసిపోతున్నాయి. వైద్యులు, సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.


శిథిలావస్థలకు చేరిన పశువైద్యశాల భవనం


వర్షానికి ఊరుస్తున్న భవనం గోడ

విషసర్పాలను నివారించేందుకు పిచికారీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

వర్షాకాలం కావడంతో మండల కేంద్రంలోని పలు వీధుల్లో, రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలతో విషసర్పాలు సంచరిస్తుండటంతో, వీటివల్ల ప్రమాదం జరిగే అవకాశముందని గ్రహించిన గ్రామపంచాయతీ సిబ్బంది ఆదివారం గ్రామంలోని అన్నివీధుల్లో గడ్డిమందును పిచికారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ మందును పిచికారీ చేశామని గ్రామపంచాయతీ సిబ్బంది మారుతి, వెంకట్ తెలిపారు.

కోటగిరిలో ఉచిత వైద్య శిబిరం


శిబిరంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలోని రచ్చగల్లీలో ఉచిత వైద్య శిబిరాన్ని అభయహస్తం ఫౌండేషన్ నిర్వాహకులు బర్ల మధుకర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. 95 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కోటగిరిలో సంజీవని హాస్పిటల్ ద్వారా ఉమ్మడి మండలాల్లో వివిధ రకాలుగా సేవలందిస్తున్నామని మధుకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కప్ప రాజయ్య, కుప్పల సాయిలు, ప్రభాకర్ పాల్గొన్నారు.

అశోక్‌నగర్ రెడ్డి సంఘం కార్యవర్గ నూతన కార్యవర్గం ఏర్పాటు


నూతనంగా ఏర్పడ్డ కార్యవర్గ సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

అశోక్‌నగర్ రెడ్డి సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చిందాల ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేందర్‌రెడ్డి, గడ్డం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోగు కిరణ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా రాధాకిషన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా పి.లింగారెడ్డి, ముఖ్య సలహాదారులుగా నిమ్మ విజయ్ కుమార్‌రెడ్డి, నారెడ్డి మోహన్‌రెడ్డి, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, ఎ.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.కమలాకర్‌రెడ్డి, వి.ఇంద్రారెడ్డి, గీరెడ్డి గంగారెడ్డిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారు మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నిరుపయోగంగా మారిన పశువుల తొట్టి


నిరుపయోగంగా పశువుల తొట్టి

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన పశువుల తొట్టి నిరుపయోగంగా మారింది. మండల కేంద్రంలోని పశువులన్నీ ఈ రోడ్డుపై నుంచి వెళ్లడంతో గతంలో వాటి దాహం తీర్చడానికై ఈ పశువుల తోట్టిని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ద్వారా ఈ తొట్టికి కులాయి కనెక్షన్‌ను అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇది నిరుపయోగంగా మారడంతో కుళాయి కనెక్షన్ తొలగించారు. దీంతో ఇది నీరులేక చెత్తచెదారంతో నిండిపోయింది. గ్రామపంచాయతీ సిబ్బంది ఈ తొట్టికి మరమ్మతులు చేపట్టి.. నూతనంగా కుళాయి కనెక్షన్ ఇచ్చి పశువుల దాహార్తిని తీర్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంత


రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంత

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ ప్రధాన రహదారి అయిన రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజు వందలాది వాహనాలు ఈ రోడ్డుపై తిరుగుతున్నప్పటికీ ద్విచక్ర వాహదారులకు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఈ గుంతను తాజా మాజీ సర్పంచ్ రమేష్ కుమార్, పంచాయతీ సిబ్బందితో పోల్చినప్పటికీ, వర్షం అది కొట్టుకుపోయి తిరిగి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. స్థానిక గ్రామపంచాయతీ సిబ్బంది ఈ గుంతలను పూడ్చి వాహనదారులకు సహకరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తగ్గిన దూరం.. సాఫీగా ప్రయాణం


పూర్తయిన బ్రిడ్జీ నిర్మాణం

- పోచారం ప్రధాన కాలువపై బ్రిడ్జీ నిర్మాణం
- గత 50 సంవత్సరాల నుంచి ఎదురుచూపు
- లింగంపల్లి గ్రామస్తుల కల.. నెరవేరిన వేళ..

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట

నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లి కలాన్ గ్రామస్తుల కల ఎట్టకేలకు నెరవేరింది. ఎన్నో సంవత్సరాలుగా పోచారం ప్రధాన కాలువపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. దాంతో నేటికి ఆ కల నెరవేరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

2023లో పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువపై బ్రిడ్జి నిర్మాణాన్ని రూ.50.90లక్షలతో ప్రారంభించారు. సంవత్సరం కాలం పాటు కొనసాగిన నిర్మాణ పనులు నేటికి పూర్తయ్యాయి.

పోచారం ప్రధాన కాలువపై బ్రిడ్జి నిర్మాణం ఎందుకు చేశారు..

లింగంపల్లి కలాన్ గ్రామస్తులు తమ పంట పొలాలకు ఆమడ దూరంలో ఉండి నాలుగు ఐదు కిలోమీటర్లు చుట్టూరా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తద్వారా అధికారులకు ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు ఎన్నోసార్లు తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. గత సంవత్సరం పనులు ప్రారంభించి నేటికీ పూర్తిచేశారు. గ్రామస్తులు చుట్టూరా తిరగలేక చాలాసార్లు పోచారం ప్రధాన కాలువలు కొన్ని నీరున్న సమయంలో నీటిలో నుంచి దాటుకుంటూ తమ పంట పొలాలకు వెళ్లాల్సి వచ్చేది. కొన్నిసార్లు నీళ్లలో నుంచి వెళ్లేటప్పుడు ఇబ్బందులు పడిన రోజులూ ఉన్నాయి. ముఖ్యంగా పశువులను మేపడానికి అదేవిధంగా తమ పంట పొలాలకు వెళ్లడానికి దూరం ఇబ్బంది కావడంతో బ్రిడ్జి నిర్మించాలని చాలాసార్లు గ్రామస్తులు కోరారు. స్పందించిన ప్రజాప్రతినిధులు బ్రిడ్జీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి బ్రిడ్జీ నిర్మాణాన్ని పూర్తి చేయించారు. తద్వారా గ్రామస్తులకు దూరం తగ్గి వెళ్లే సమయం ఆదా కావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది



తమ గ్రామం సమీపంలో పోచారం ప్రధాన కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేయడంతో చాలా ఆనందంగా ఉంది. తమ గ్రామస్తులు చాలా ఏండ్లుగా బ్రిడ్జి నిర్మాణం కొరకు ఎన్నోసార్లు అధికారుల చుట్టూ ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో బ్రిడ్జిపై నుంచి పంట పొలాలకు సులువుగా, తొందరగా వెళ్లే అవకాశం కలిగింది.

– కోనేటి కుమార్, మాజీ సర్పంచ్

సెంట్రలైజ్డ్ కిచెన్ విధాన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దర్శనం గంగాధర్


షబ్బీర్‌అలీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సెంట్రలైజ్డ్ కిచెన్ విధాన నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దర్శనం గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం గంగాధర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. అలాగే మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచి, ఇతర సమస్యలూ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. సెంట్రలైజ్డ్ కిచెన్ విధాన నిర్ణయంపై సీఎంతో చర్చిస్తానని తెలిపారు. ప్రస్తుతమున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీలనే కొనసాగిస్తామని, అలాగే ఇతర సమస్యలు పరిష్కరించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్మూర్ సునంద తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి బరిలో కాసిఫ్



నవతెలంగాణ-లింగంపేట్

కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా లింగంపేట్ గ్రామానికి చెందిన మమత కాసిఫ్ బరిలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 5 నుంచి అక్టోబర్ 5 వరకు ఆన్లైన్ ద్వారా నిర్వహించే రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా లింగంపేట్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మొహమ్మద్ కాసిఫ్ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ ద్వారా 18 నుంచి 35 సంవత్సరాలలోపు వారు తమ ఓటింగ్‌లో పాల్గొని ఓటు వేసి తమను గెలిపించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ నాయకులు యువకులను ప్రోత్సహించి ఆన్లైన్ ద్వారా తన ఓటును వేయించి అత్యధిక మెజార్టీ వచ్చేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వచ్చే నెల 5 నుంచి ప్రారంభమయ్యే ప్రచారంలో యువతీ యువకులు తనకు మద్దతు తెలిపాలని ఆయన కోరారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డిలోని సి.ఎస్.ఐ పాఠశాలలో శనివారం 1996-1997 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిఎస్ఐ పాఠశాలలో తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.70వేల వ్యయంతో దీనిని ఏర్పాటు చేయగా సిఎస్ఐ చర్చి ఫాదర్ జోషఫ్ కిషోర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఇమాన్యుయల్, వరలక్ష్మీ టీచర్లు మోటార్లను స్విచ్ఆన్ చేసి ప్రారంభించారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినందుకు ప్రధానోపాధ్యాయులు ఎం.ఆమోస్ పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు బి.రాజుపాటిల్, ఈ.రమేష్, మోహన్‌బాబు, విఘ్నేష్, అరుణ, లక్ష్మీ, తిరుపతమ్మ, శశికుమార్, సుదర్శన్, రాజిరెడ్డి, ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి పోటీ

- రిజర్వేషన్ డిక్లేర్ కాకపోయినా దళితుల్లో పెరుగుతున్న పోటీ

నవతెలంగాణ-మద్నూర్

మూడు రాష్ట్రాలకు పూర్తిగా సరిహద్దులో గల మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కామారెడ్డి జిల్లాలో ప్రఖ్యాతిగాంచింది. ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం రిజర్వేషన్ డిక్లేర్ కాకపోయినప్పటికీ దళితులు చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నారు. ఈ ఏడాది మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఎస్సీ మహిళగా రిజర్వేషన్ వస్తుందనే పుకార్లు వినబడుతున్నాయి.

అధికారికంగా మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రిజర్వేషన్ ఏది అనేది ఇంకా డిక్లేర్ కాలేకపోయినప్పటికీ దళితులు మాత్రం ఈసారి ఎస్సీ మహిళకే చైర్మన్ పదవి ఉంటుందని జోరుగా ప్రచారం చేస్తున్నారు. మద్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలో మద్నూర్, జుక్కల్ మండలాలతో పాటు ఇటీవల నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండలం కూడా ఉంది. ఈ మూడు మండలాల పరిధిలోని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తమకంటే తమకే వస్తుందని ఆశతో కాంగ్రెస్ హైకమాండ్ వద్ద జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు వద్ద మద్దతు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్టు జోరుగా చర్చలు వినబడుతున్నాయి. మద్నూర్ మార్కెట్ కమిటీ పత్తి కొనుగోళ్లలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని ప్రఖ్యాత గాంచింది. ప్రతి సంవత్సరం పత్తి కొనుగోళ్ల మూలంగా ఈ మార్కెట్ కమిటీకి కోట్లల్లో ఆదాయం వస్తుంది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రిజర్వేషన్ ఎస్సీ మహిళకు వస్తుందా లేక రిజర్వేషన్‌లో మార్పు ఉంటుందా అనేది తెలియని పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందో అనేది వేచి చూడాల్సిందే.


మద్నూర్ మార్కెట్ కమిటీ కార్యాలయం

ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అడ్డుకుంటాం

- మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్

నవతెలంగాణ-బోధన్

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో మద్దతిస్తే ఎమ్మెల్యేలను తిరగనివ్వకుండా అడ్డుకుంటామని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరడి ఈశ్వర్ హెచ్చరించారు. ఆదివారం ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బోధన్ డివిజన్ మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని దానిపై రివీవ్ అప్పీల్ చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో మాలలకు వ్యతిరేకంగా వర్గీకరణ బిల్లు పెడతామని అనడం సరికాదని అన్నారు. ఏ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరగనివ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను విడగొట్టే ప్రయత్నం మానుకోవాలని సూచించారు. మాదిగ సోదరులు ఈ కుట్రను గ్రహించాలని కోరారు. ఇది విజయం కాదు.. ఇది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర అని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు చిట్టేటి మోహన్ రావు, జిల్లా కార్యదర్శి నీరడి రవి, బోధన్ డివిజన్ అధ్యక్షులు మదాస్తూ శ్రావణ్ కుమార్, డివిజన్ కమిటీ ఉపాధ్యక్షులు కారం స్వామి, జిల్లా ప్రతినిధులు ఆనంపల్లి ఎల్లయ్య, సూర్యాకాంత్ వాగ్మారే, డిస్కో సాయిలు, సాలెన్ సంజీవ్, రాహుల లక్ష్మణ్, విఠల్, అలోక్, గౌతం, బోధన్ డివిజన్ కమిటీతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.


నిరసనలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

ఆరోగ్యంగా ఉండడానికి సైకిల్ యాత్ర

నవతెలంగాణ-లింగంపేట్

ఆరోగ్యంగా ఉండడానికి సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నామని సైకిల్ యాత్రలో పాల్గొన్న యువకులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరానికి చెందిన 20 మంది వయసుతో తేడా లేకుండా ఉదయం 6 గంటలకు 20 మంది బృందంతో కొంపల్లి సెంటు మాటిన్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని సైకిల్ యాత్ర ప్రారంభించారు. నర్సాపూర్ మీదుగా మెదక్, ఎల్లారెడ్డి, లింగంపేట్, కామారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరుతామని వారు తెలిపారు. 20 మంది సభ్యులు సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. సైకిల్ యాత్రలో శంకర్, సత్యనారాయణ, హర్షతో పాటు 20 మంది సభ్యులు 20 గంటల్లో 300 కిలోమీటర్లు గమ్యం చేరడమే తమ లక్ష్యమని వివరించారు. సైకిల్ యాత్ర చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు గ్రామీణ ప్రాంతాల నేపథ్యం, వనరులు, తదితర ప్రాంతాలను చూసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సైకిల్ యాత్రతో 100శాతం ఆరోగ్యంగా ఉంటారని, ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఎటు చూసినా పచ్చని పైర్లు, అడవులు, సామాజిక నేపథ్యం, గ్రామీణ ప్రాంతం నేపథ్యాలను తిలకిస్తున్నామన్నారు.


సైకిల్ యాత్రలో పాల్గొన్న పలువురు

నేటి నుంచి శ్రావణమాసం పూజలు

నవతెలంగాణ-రామారెడ్డి

నేటి నుంచి శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మండలంలోని ఈసన్నపల్లి రామారెడ్డిలో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి, మద్దికుంటలో వెలిసిన శ్రీ స్వయంభుబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది. మద్దికుంట ఆలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వహిస్తున్నందున, పాల్గొనే భక్తులు ఆలయ కమిటీకి సమాచారం అందించాలని సూచించారు.

జిల్లా ఇంటర్ విద్యాధికారికి సన్మానం



నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా బోధన్ ప్రభుత్వ మధుమలాంచ జూనియర్ కళాశాలకు వర్ని నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం మధుమలాంచ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళాశాల పూర్వ విద్యార్థి, కళాశాల ప్రిన్సిపాల్ కూడా జిల్లా అధికారి కావడం ఎంతో అదృష్టమని బోధన్ ఏబీవీపీ నాయకులు కొనియాడారు. కళాశాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేయాలని, నూతన భవన నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. అనంతరం మొక్క అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యకుమార్, లక్ష్మణ్ చోహన్, శివకుమార్ యాదవ్, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

- హత్యానా? ఆత్మహత్యనా?

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట గ్రామ పరిసర ప్రాంతంలో గల దామెర చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఘటనా స్థలానికి చేరుకుని గుర్తు తెలియని శవంగా గుర్తించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, శవాన్ని మార్చురీలో భద్రపరిచారు. వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా, లేదా ఎవరైనా హత్యచేసి చెరువులో పడేశారా..? అనే ప్రశ్నలు స్థానికులకు ఉత్పన్నమవుతున్నాయి. చనిపోయిన వ్యక్తి ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా స్థానికులు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తి 35 నుంచి 40 సంవత్సరాలు కలిగి ఉంటాడని, ఎవరైనా వ్యక్తిని గుర్తిస్తే 8712686152 నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై నరేష్ తెలిపారు.

కారు, ఆటో ఢీ కొనడంతో పలువురికి గాయాలు

నవతెలంగాణ-పిట్లం

కారు, ఆటో ఢీకొన్న ఘటన మండల కేంద్రంలోని హెచ్‌పి పెట్రోల్ పంపు వద్ద చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆదివారం మండల కేంద్రం నుంచి పెద్దకొడప్‌గల్ వైపు వెళ్తున్న ఆటో హెచ్‌పి పెట్రోల్ పంపు వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వస్తున్న కారు పంపులోకి టర్న్ అవుతున్న తరుణంలో కారు వెనుకభాగం ఒక్కసారిగా ఢీ కొట్టడంతో ఆటో బోల్తాపడింది. కాగా ఆటోలో ప్రయాణిస్తున్న 5, 6 గురు ప్రయాణికులకు గాయాలు కావడంతో స్థానికులు క్షతగాత్రులను మండల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

శిథిలావస్థకు చేరిన 108 షెడ్డు


శిథిలావస్థకు చేరిన షెడ్డు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన 108 షెడ్డు శిథిలావస్థకు చేరుకుంది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఏసిడిపి నిధులతో 108 వాహనానికి షెడ్డు నిర్మించినప్పటికీ అది నిరుపయోగంగా మారింది. 17-10-2008లో అప్పటి బోధన్ ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి ప్రారంభించగా.. ఈ షెడ్డు ఆలనా పాలన కరువై శిథిలావస్థకు చేరుకుంది. సంబంధిత శాఖ ఈ షెడ్డు పునర్నిర్మాణానికి ముందుకు వస్తే 108 వాహనానికి రక్షణగా ఉంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీవో

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని దాల్మల్కపల్లి గ్రామాన్ని ఎంపీఓ ప్రకాష్ ఆదివారం సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శితో కలిసి గ్రామ వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి స్థానిక ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల పెరుగుదలను అరికట్టడానికి నీరు నిలవకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా వి.ఓ, అంగన్వాడీ టీచర్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజుల కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలో ముదిరాజ్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు ముదిరాజ్ మండల గౌరవ అధ్యక్షుడు గంపల వెంకన్న తెలిపారు. ముదిరాజ్ మండల గౌరవ అధ్యక్షుడిగా గంపల వెంకన్న, అధ్యక్షులుగా చుక్క బాలయ్య, ఉపాధ్యక్షులుగా బోయిని కృష్ణ, నర్సింలు, తిమ్మాయపల్లి భూమయ్య, జక్కుల బాలరాజ్, ప్రధాన కార్యదర్శిగా సత్య బోయిన నారాయణ, కార్యదర్శిగా బాసారం గోపాల్, కోశాధికారిగా జోడు సాయిలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామాలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు

నవతెలంగాణ-బోధన్

ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు సమర్థిస్తూ తీర్పు వెలువడించడంతో ఆదివారం బోధన్ ఉమ్మడి మండలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి సంబరాలు చేశారు. సాలూరా మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో, బోధన్ మండలంలోని పెగాడపల్లి, కల్దుర్కి గ్రామాలలో దండోరా నాయకులు డప్పులు కొడుతూ ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామయ్య, ఖాజాపూర్ మాజీ సర్పంచ్ చింతం నాగయ్య, మైసయ్య, కల్దుర్కి గ్రామంలో లసింగారి భూమయ్య తుడుం బాబు, మారయ్య, గంగాధర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.